## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్


ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బొల్లం మల్లయ్య యాదవ్

చిలుకూరు, జనవరి 12: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొల్లం మల్లయ్య యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని జానకీనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను కైవసం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటి అమలులో విఫలమైందని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ నేటికీ పూర్తిస్థాయిలో చేయలేదని మండిపడ్డారు. మొదట రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని అనడం వారి చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో కక్షపూరిత పాలన నడుస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు విధానాలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామాచారి, ప్రధాన కార్యదర్శి అంబాల రాంబాబు, సహకార సంఘం చైర్మన్ అల్సకాని జనార్దన్, జిల్లా, మండల నాయకులు కస్తూరి నర్సయ్య, భట్టు శివాజి, దొడ్డా సురేశ్‌బాబు, షేక్ జానిమియా, కడియాల వెంకటేశ్వర్లు, తాళ్లూరి శ్రీను, కుర్రా అచ్చయ్య, పాషా పాల్గొన్నారు.

## 'బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి హేయం'


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు సతీశ్

పాలకవీడు, జనవరి 12: కాంగ్రెస్ పార్టీ గూండాలు భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై చేసిన దాడి హేయమని బీఆర్ఎస్ యువజన నాయకుడు పెరుమాళ్ల సతీశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కరుణాకర్, హనుమంతు, రమేశ్, వీరబాబు, నరేశ్, వెంకన్న, కోటేశ్వరావు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చివ్వెంల, జనవరి 12: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని అక్కలదేవిగూడెం శివారులో ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారి 365పై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఉమ్మెంతల కిరణ్ పద్మాకర్ (29) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతికి పండుగ కోసమని తన ద్విచక్ర వాహనంపై ఖమ్మం బయలుదేరాడు. అక్కలదేవిగూడెం వద్దకు రాగానే ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతి వేగంగా వచ్చి రోడ్డుపై పడి ఉన్న కిరణ్ పద్మాకర్‌ను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రమాద విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం : జిల్లా గ్రంథాలయ చైర్మన్


కోదాడ రూరల్: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న గ్రంథాలయ చైర్మన్ రామారావు

కోదాడ రూరల్, జనవరి 12: క్రీడలతో శారీక ఆరోగ్యం, మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ పరిధి కొమరబండలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, ముగ్గుల పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మామిడి రామారావు, తమలపాకుల లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ డైరెక్టర్లు బత్తుల కిట్టుయాదవ్, వేముల వీరబాబు, కొర్రపిడతల వీరబాబు, చట్టం మురళి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### కబడ్డీ పోటీలు ప్రారంభం

చివ్వెంల: మండలంలోని మూన్యానాయక్ తండాలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను లంబాడీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు దరావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర కార్యదర్శి బానోతు సురేశ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్: గట్టికల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ ప్రారంభించారు. అదేవిధంగా తుమ్మల పెన్‌పహాడ్‌లో జై భీమ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలను ఎస్ఐ ప్రారంభించారు.

## 'సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి'

నూతనకల్, జనవరి 12: ఈ నెల 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కార్యకర్తలతో కలిసి ఆదివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు, కార్మికులు, రైతులు, రైతు కూలీల సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తుందని గుర్తుచేశారు. మహాసభలకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవులు, వీరమల్లు, సురేందర్, వెంకటరెడ్డి, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

నూతనకల్, జనవరి 12: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయకపోవడంతో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. సంఘం నాయకులు భవానీశంకర్, వేణుగోపాల్, రాజు, సందీప్, వీరు, అభిలాశ్ పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరుకాపు సంఘం సభ్యులు

అర్వపల్లి, జనవరి 12: మండలంలోని బొల్లంపల్లి మున్నూరుకాపు స్ఫూర్తి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆకుల సోమేష్, అంజయ్య, సుధాకర్, నరసింహారావు, తూడి మల్లేశ్, ఆకుల శ్రీను, రాజేందర్, లింగయ్య, కరుణాకర్, కోనేటి జానకిరామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట రూరల్, జనవరి 12: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడికి నిరసనగా భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ ఆదివారం మహాధర్నా నిర్వహించ తలపెట్టింది. ఈ ధర్నాకు బయలుదేరిన సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డు గాంధీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు ఎస్‌కే.రఫీ, నాయకులు బానోతు కేశవ్, నాగేశ్వర్‌రావును రూరల్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

నడిగూడెం: మండలం నుంచి భువనగిరికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు అనంతుల ఆంజనేయులు, గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్, నాయకులు పోలంపెల్లి వెంకటేశ్వర్లు, దున్నా సుధాకర్, మేకల గంగరాజు, కూరాకుల కృష్ణమూర్తి, జలీల్, కలకొండ పిచ్చయ్య, దొడ్డి నరసింహారావు, వీరగోవింద్, బొల్లం శ్రీనివాస్, దున్నా రవి, బుడే సాబ్, మేకల వీరబాబు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆత్మకూర్.ఎస్: బీఆర్ఎస్ మండల నాయకులు మర్ల చంద్రారెడ్డి, కసగాని బ్రహ్మంగౌడ్, మిర్యాల వెంకటరెడ్డి, గునగంటి భిక్షం, గిలకత్తుల రాములు తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

తిరుమలగిరి: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీశ్, నాయకులు రవీందర్, నరోత్తంరెడ్డి, బాబు, నరేశ్, నాని, లింగయ్య, ప్రవీణ్ తదితరులను అరెస్ట్ చేశారు.

నాగారం: బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దోమల బాలమల్లు, యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్, గ్రామశాఖ అధ్యక్షుడు కన్నెబోయిన మల్లేశ్, కన్నెబోయిన కుమార్ అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.


నాగారంలో..


నడిగూడెంలో..


సూర్యాపేట రూరల్: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు


ఆత్మకూర్.ఎస్: పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

## సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, జనవరి 12: గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి ముగ్గులు వేసే సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు అడ్రస్‌లు అడుగుతూ మెడలోని ఆభరణాలను దొంగిలించే అవకాశం ఉందని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటికి భద్రంగా తాళం వేయాలని, పొరుగింటి వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విలువైన వస్తువులు, ఆభరణాలు, నగదు భద్రపర్చుకోవాలని కోరారు.

## అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన


నేరేడుచర్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నేరేడుచర్ల, జనవరి 12: రాష్ట్రంలోనే హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రూ.18.57 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, తాసీల్దార్ సైదులు, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, మార్కెట్ చైర్‌పర్సన్ బెల్లకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్ల సురేశ్ రెడ్డి, చలసాని ఫౌండేషన్ చైర్మన్ చలసాని రాజీవ్, కౌన్సిలర్లు నూకల సుగుణ, రణపంగ నాగయ్య, బాషా, వేమూరి నాగవేణి, లలిత భరత్, బైరెడ్డి జితేందర్ రెడ్డి, కొత్తమగుండ్ల సరిత, మత్స్య సహకార సంఘం చైర్మన్ పేరబోయిన వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రికి వినతి**

మండలానికి చెందిన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి కర్నాకర్‌రెడ్డి, టి.ఎన్. స్వామి, అలక సైదిరెడ్డి, ఈగ శ్రీనివాస్, మానుకొండ రాంరెడ్డి, నరజాల వెంకటేశ్వరరావు, రావుల రాజు, సట్టు శ్రీను, యారవ సురేశ్, చామకూరి వీరయ్య, దేవులపల్లి శంకరాచారి పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు


మునగాల: విజేతలకు బహుమతులను అందజేస్తున్న హరికిషన్ కుటుంబ సభ్యులు

తిరుమలగిరి, జనవరి 12: సంక్రాంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పాతబస్తీ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు.

మునగాల: సంక్రాంతి సందర్భంగా మునగాల మండల నమస్తే తెలంగాణ మాజీ రిపోర్టర్ చిల్లంచర్ల హరికిషన్ జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆయన కుటుంబ సభ్యులు, మిత్రమండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కందిబండ సత్యనారాయణ, చిల్లంచర్ల ప్రభాకర్‌రావు, అర్వపల్లి శంకర్, యుగేంధర్‌రెడ్డి, ఉడుం కృష్ణ, ఎల్‌పీ రామయ్య, గంధం సైదులు, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: పట్టణంలోని విద్యానగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు, ఉండ్రుగొండ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తియాదవ్, గాయత్రి దంపతులు, కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, షఫీఉల్లా, నామా అరుణప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఎం, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఎంవీఎన్ భవన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి, టీపీటీఎల్ఎఫ్ జిల్లా కార్యదర్శి జె.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నాగారం: క్రాంతి యువజన సంఘం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

కోదాడ టౌన్: పట్టణంలోని 22వ వార్డు శ్రీ సాయి నగర్ కాలనీలో గోపిరెడ్డి చంద్రశేఖర్, పత్తిపాక జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు బహుమతులను అందజేశారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ కడుపులోని కణతి తొలగింపు

హుజూర్‌నగర్, జనవరి 12: కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన అంకతి వీరమ్మ కడుపు నొప్పితో బాధపడుతూ పట్టణంలోని శ్వేత ఆసుపత్రిలో చేరింది. స్కానింగ్ చేసిన వైద్యులు ఆమె కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించారు. శనివారం వైద్యులు సునీల్‌కుమార్, శ్వేత ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి 6.5 కిలోల కణతిని తొలగించారు.

## బంగారు గొలుసు చోరీ

కోదాడ రూరల్, జనవరి 12: కోదాడ పట్టణంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలోని 6 తులాల బంగారు గొలుసును అపహరించారు. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధి శ్రీనగర్ కాలనీకి చెందిన నలమోతు రమ ఉదయం ఇంటి ముందు ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలోని గొలుసును లాక్కొని పారిపోయారు. ఈ విషయపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెన్‌పహాడ్, జనవరి 12: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొంచెం లింగయ్య, శైలజ దంపతుల కుమారుడు నిరంజన్ (22) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల నిరంజన్ మద్యానికి బానిసయ్యాడు. కాగా, ఈ నెల 10న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మఠంపల్లి, జనవరి 12: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన వర్దాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చీపిరి లింగస్వామి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు రావడంతో బియ్యం, ధాన్యం, వంట సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.లక్ష విలువైన వస్తువులు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు.

## పోలీస్ బందోబస్తును పరిశీలించిన ఐజీ


కొమరబండ వై జంక్షన్ వద్ద ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

కోదాడ రూరల్, జనవరి 12: సంక్రాంతి సందర్భంగా ఆంధ్రాకు భారీగా వెళ్తున్న వాహనాలకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించేందుకు 65వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును మల్టీ జోనల్ ఐజీ సత్యనారాయణ ఆదివారం పరిశీలించారు. అదేవిధంగా కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ వై జంక్షన్, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నల్లబండగూడెం శివారులోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో ఇద్దరు ఎస్పీలు, 15 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 550 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అనుమతులు లేని బస్సులకు జరిమానా


బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

కోదాడ రూరల్, జనవరి 12: కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై గల అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఆర్టీఓ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని బస్సులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సరైన పత్రాలు, అనుమతులు లేని ప్రైవేట్ బస్సులకు రూ. 1.84 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం వాహనదారులకు రోడ్డు భద్రత నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సాయిప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలి

- ఎస్ఐ సురేశ్


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తిరుమలగిరి, జనవరి 12: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేశ్ మాట్లాడుతూ.. వాహనదారులు కచ్చితంగా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి రన్నింగ్ పోటీల్లో ప్రతిభ


మెడల్‌తో ప్రవీణ్

హుజూర్‌నగర్, జనవరి 12: జాతీయస్థాయి రన్నింగ్ పోటీల్లో హుజూర్‌నగర్ సాంఘిక సంక్షేమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె.ప్రవీణ్ సత్తా చాటాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో శనివారం నిర్వహించిన 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌లో 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రథమ బహుమతిగా గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దున్న వెంకటేశ్వర్లు, పీఈటీ రాములు ఆదివారం విద్యార్థిని అభినందించారు.

## 'వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలి'

గరిడేపల్లి, జనవరి 12: భూమిలేని వ్యవసాయ కార్మికులకు షరతులు లేకుండా ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే.యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అబ్బిరెడ్డిగూడెం, సుభాశ్‌నగర్, లక్ష్మీపురం గ్రామాల్లోని భూమిలేని వ్యవసాయ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో 10 లక్షల మంది భూమిలేని వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అర్హులకు నిరుద్యోగ భృతి, పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. పేదల సంక్షేమానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లచ్చిమల్ల పెంటమ్మ, పాపమ్మ, కుమారి, శ్రీను, బండ్ల సైదులు, సునీత, స్వామి, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

కోదాడ రూరల్, జనవరి 12: మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమాటి వరప్రసాద్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.8 లక్షలతో నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొండపు సతీశ్, పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం, చల్లా నర్సయ్య, కాసాని ధనయ్య, బాలేబోయిన రాజు, వీరయ్య, మీగడ లింగయ్య, సత్యం, వేణు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మేళ్లచెర్వు: గురువులతో పూర్వ విద్యార్థులు

మేళ్లచెర్వు, జనవరి 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

కోదాడ టౌన్: పట్టణంలోని ప్రతిభ పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక నాగుబండి లక్ష్మయ్య తోటలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

సూర్యాపేట అర్బన్: జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఆత్మకూర్.ఎస్: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు నెమ్మికల్‌లోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

సూర్యాపేట టౌన్: దురాజ్‌పల్లిలోని వివేకానంద విజ్ఞాన మందిరం పాఠశాలలో 1996 నుంచి 2002 సంవత్సరం వరకు 6 నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థులు స్థానిక తిరుమల గ్రాండ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.


కోదాడ టౌన్: ప్రతిభ పాఠశాల పూర్వ విద్యార్థులు


సూర్యాపేట అర్బన్: లిటిల్ ఫ్లవర్ స్కూల్ పూర్వ విద్యార్థులు


సూర్యాపేట టౌన్: వివేకానంద విజ్ఞాన మందిరం విద్యార్థులు


గురువులతో ఆత్మకూర్.ఎస్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు